# శరణార్థి

ఇంకా చీకటి బాగా వీడలేదు.

రమణమ్మ బస్సుదిగి బట్టలమూటా, చెంబూ, కర్ర అందుకున్నది. ఆమెతో పాటు ఒకరిద్దరు ప్రయాణీకులు దిగారు. ఆమె ఇటూఅటూ చూసింది. ఆ ఊరంతా కొత్తగా కనబడ్డది.

మట్టిరోడ్డువెంట పదిగజాలదూరం నడిచి, ఒక చెట్టుకింద కూర్చుంది.

"ఇది చింతలూరనుకుని దిగాను. కండక్టరునడిగితే ఇదేనన్నాడు. ఇక్కడ కొన్ని పెంకుటిళ్ళు పూరిళ్ళూ ఉండాలి కదా!" అనుకుంది.

ఆ దారివెంట అప్పుడొకరూ అప్పుడొకరూ నడుస్తున్నారు, వాళ్ళెవరికీ తను తెలియదేమో? తెలిస్తే పలకరించరూ?

ఆకాశమంతా తెల్లబారింది. తూరుపుదిశన తెలుపు రంగులోనుంచి నీలిరంగు విడిపోతున్నది. జేవురురంగు పులుముకుంటోంది. ఏడుగుఱ్ఱాలదొర వెలుగులు చిమ్ముతూ పైకిలేస్తున్నాడు. బాగా పొద్దెక్కితేగాని ఆ ఊళ్ళో సందడి మొదలు కాదు. పాలూ, పెరుగూ, కూరగాయలూ ఆ ఊరినుంచే ఎగుమతి అవుతూ ఉంటాయి పట్టణాలకు.

రాత్రి బస్సులో కునికిపాట్లు తప్ప సరిగా నిద్రలేదు. చెట్టుకు తలఆన్చి రమణమ్మ కళ్ళుమూసింది. నిద్ర అవహించినా మధ్య మధ్య ఉలికిపాటుగా కళ్ళు తెరుచుకుంటున్నాయి. ఆ కనుమూతలోనే కలతనిద్ర.

ఆ ఊరు విడిచిపెట్టిన ఏభయి సంవత్సరాల తాలూకు తళుకురేఖలు కనుపించినప్పుడు ముఖంలో మందహాసం-జీవితంలో తీసిన ఉరుకు పరుగులు తలపుకు వచ్చినప్పుడు లేవబోవటం-ఇట్లా ఎంతకాలం అని అనిపించినప్పుడు ఒక మాదిరి ఆవేదనా భరితమైన ఛాయలూ, ఆశా నిరాశాలూ-ఏవేవో ఆ వాడిపోయిన

ముఖంలో బాగా పరికించి చూడగలిగితే కనబడకపోవు. అరవైసంవత్సరాలు దాటినప్పటికీ ఆ దేహం ముడతలుపడలేదు. తల వెంట్రుకలు సాంతం నెరవలేదు. చేతికి పెట్టుకున్న రాగిమురుగులు అరిగిపోయాయి గాని వదులవలేదు.

పొద్దు ఎక్కుతున్నది. జనమంతా ఇటునుంచి వెళ్ళటమేగాని అటునుంచి వచ్చేవారు తక్కువగా ఉన్నారు. ఊరంతా అటుందేమో? అయితే బస్సు ఊరిబైట ఆపాడా ఏమిటి?

ఆమె మెల్లిగాలేచి బట్టలమూట చేతికి తగిలించుకుని, చెంబు చేతపట్టుకుని కర్ర ఆసరాతో నాలుగడుగులు వేసింది. ఈ మధ్యనే కాలు బెణికి నడవనివ్వక పోతే కర్ర పట్టుకుని నడుస్తోంది. ఆ వెనకవైపు చెరువొకటి ఉండాలనుకుంటూ ముఖం కడుక్కునే ప్రయత్నంలో నాలుగడుగులు వేసింది. కనుచూపు మేరలో చెరువు కనబడలేదు. ఆమె ఊహించినచోట కాస్త పల్లంగా ఉంది. ఊరంతా పంపులు పెట్టుకున్నారేమో? దీపాలూ, నీళ్ళూ ముందుగా అన్ని ఊళ్ళకూ వచ్చినట్టే ఇక్కడ కూడా వచ్చాయేమో?

దారివెంటనడిచే జనంవెంట నడుస్తోంది. కొంతదూరం నడిచి "మీకెవరి కయినా సాలూరి నరసయ్య ఇల్లు తెలుసా బాబూ" పక్కనున్న వాళ్ళను అడిగింది.

కొందరు వినిపించుకోకుండా వెళ్ళిపోయారు. కొందరు జవాబు చెప్పకపోతే బాగుండదని 'ఇంకా ముందర చాలా ఇళ్ళున్నాయి, అక్కడ అడుగుదాం. మాతో రండి' అన్నారు.

ఆమెకు దారివెంట కొత్తకొత్త ఇళ్ళూ. రోడ్డుమీదనే పంపులూ కనబడ్డాయి. నాలుగురోడ్ల కూడలిలో పెద్ద మార్కెట్టూ, షాపులూ, గుంపు గుంపులుగా జనం కనబడుతూ ఉంటే కనుబొమలు పైకిలేచాయి. పల్లెమారింది. పట్నపుకళ వచ్చింది. అంతవరకూ ఆమెకు తెలిసినవారెవరూ కనబడలేదు వీధిలో.

వీధికి రెండుపక్కలా ఉన్న ఇళ్ళను- మేడలూ మిద్దెలూ పెంకుటిళ్ళూ చూసుకుంటూ పోతున్నది. చటుక్కున ఆమె నడకఆగి, ఒక పెంకుటింట్లో ఉన్న పనసచెట్టుమీద చూపు మళ్ళింది. వీధివాకిటి ముందర నిలబడి 'ఏమండీ, సాలూరు నరసయ్యగారిల్లు ఎటో చెబుతారా?' బిగ్గరగా అడిగింది.

"సాలూరు నరసయ్యా! ఆయన ఇప్పుడులేరు కొడుకు ఉన్నాడు గాని నిద్ర ఇంకా లేవలేదు. రండి లోపలికి" అన్నదాక ఆమె మెట్లమీద నిలబడి

రమణమ్మ మెట్లెక్కి లోపలికివెళ్ళి గుమ్మానికి పక్కగా మూటపెట్టుకుని కూర్చుంది.

కొంత సేపటికి పాతికేళ్ళతను గదిలోనుంచి వచ్చాడు.

'ఎవరికోసమండీ?'

'సాలూరి నర్సయ్య కోసం వచ్చాను. ఆయన ఇల్లు ఇదేనా?'

'ఇదే ఇల్లు' అతడామెను పరీక్షగా చూస్తున్నాడు.

"ఆయన మా నాన్న చనిపోయి ఐదేళ్ళయింది. ఏమైనా పనిమీద వచ్చారా!"

"నరసయ్య నా తమ్ముడు. చూడాలని వచ్చాను. కాని ఏం లాభం? ఆ ఒక్క తోడబుట్టినవాడినీ కంటితో చూడలేకపోయాను" ఆమెకు దుఃఖం ముంచుకు వచ్చింది.

"అత్తయ్య నీవా? నీకో అత్తయ్య ఉన్నదని నాన్న చెబుతూ ఉండేవాడు. నాన్న నిన్ను తలవని రోజులేదు. "మాఅక్కయ్యరా. నన్ను మూడేళ్ళపిల్లవాడప్పటి నుంచీ పెంచింది. అప్పుడు అక్కయ్యకు ఎనిమిదేళ్ళు. నాకు పదేళ్ళప్పుడు అక్కయ్యకు పెళ్ళయింది. అత్తవారింటికి వెళ్ళిపోయింది. అక్కయ్యను వదిలిపెట్టి ఉండలేక, నాకు జ్వరంవచ్చేసింది. అప్పుడు మా నాన్న నన్ను అక్కయ్య దగ్గరే ఉంచేశాడు. పదిహేనేళ్లు వచ్చేవరకూ అక్కడే ఉండిపోయాను. 'పెద్దవాడి వయ్యావు' అని మా నాన్న ఇంటికి తీసుకువచ్చాడు. అని చెప్పి విచారపడుతూ ఉండేవాడు."

"నాకు వాడిని మళ్ళీచూసే ప్రాప్తంలేదు. నేను సంసారసాగరంలో నిండా మునిగి ఉన్నాను క్షణం తీరికలేదు. రాత్రి పగలు కూడా చాకిరి. ఏం జబ్బు చేసింది? నాకు ఉత్తరం రాయకపోయావా? వచ్చిచూసేదాన్ని."

"నీకు ఉత్తరం రాయకేం? రాశాను. చివరిదశలో నీదేస్మరణ, వస్తావని కళ్ళుగుమ్మంవైపు పెట్టి ఉంచేవాడు."

ఆమెకు ఉబికి ఉబికి దుఃఖంపైకి వస్తోంది ఆపుకోలేక పోతోంది.

"ఊరుకో అత్తయ్యా నీవెప్పుడు బయలుదేరావు? ఇక్కడికెప్పుడు వచ్చావు?"

"నిన్నరాత్రి పదిన్నరకు బస్సుఎక్కాను. తెల్లారకుండా ఊరిచివరదింపాడు. అక్కడే చెట్టుకింద కూర్చుని ఈదారిన నడిచే జనంతో వచ్చాను. ఇల్లు తొందరగా గుర్తుతెలిసిందికాదు. అదిగో ఆ పనసచెట్టు పట్టించింది."

"ఊరు గుర్తుపట్టలేకుండా మారిపోతూఉంది, సరేగాని, ముఖం కడుక్కున్నావా ? కాఫీ తాగుదువుగాని."

"లేదు, ఇప్పుడే కడుక్కుంటాను" మూటలోనుంచి పొట్లంవిప్పి కావలసిన పొడి వేసుకుని మళ్ళీ భద్రంగా మూటలో పెట్టి లేచింది.

"అత్తయ్యా ఇటువెళ్ళు, పెరట్లోకి వెళ్ళక్కర్లేదు. ఆ గదిలో నీళ్ళుంటాయి. ముఖం కడుక్కో"

ఆమె రాగానే అతడు కాఫీగ్లాసు చేతికిచ్చి, "ఇలా కుర్చీమీద కూర్చుని తాగు అత్తయ్యా"

ఆమె కాఫీగ్లాసందుకుంటూ "మనవాళ్ళంతా బాగున్నారా?" అడిగింది.

"అంతా బాగానే ఉన్నారు. అక్కడి సంగతులు చెప్పు ?"

"ఏముంది ? అంతామామూలే"

"అమ్మాయి నీ భార్యా ? అమ్మ కనపడదేం ?"

"సాయంత్రానికల్లా వస్తుంది. పక్కఊళ్ళో దేవుడిగుళ్ళో పూజలు చేస్తున్నారంటే వెళ్ళింది. నీ అలసటంతాపొయ్యేలా వేడి వేడి నీళ్ళతో స్నానం చెయ్యి అత్తయ్యా."

"చేస్తాలే ఇల్లంతా తిరగకట్టినట్లున్నారు. ముందుభాగం అలాగే ఉంచారేం ? అదికూడా డాబా చెయ్యకపోయారా ? అదిసరే, నీవు ఉద్యోగం చేస్తున్నావా ? ఇంకా చదువుతున్నావా ?"

"బ్యాంకిలో ఉద్యోగం వచ్చింది. ఇక్కడికి పాతికమైళ్ళదూరం. బస్సులో వెళ్ళివస్తాను, ఇవాళ సెలవు."

మేనల్లుడితో ఆ ఊరి కబుర్లు మాట్లాడుతూ పదకొండుగంటలకు భోజనం

చేసింది రమణమ్మ. రాత్రి సరిగా నిద్రలేదని ఒక చాపయిస్తే తీసుకుని వసారాలో పడుకుని నిద్రపోయింది. అమె నిద్రలేచేవరకు నాలుగయింది. మేనల్లుడి భార్య సుశీల కాఫీ తెచ్చియిచ్చింది. అలసట తీరేవరకూ నిద్రపోయిన రమణమ్మకు ఆ కాఫీ కొత్తబలాన్నిచ్చినట్లయింది. నిజానికి తను మంచికాఫీ కాకపోయినా నీళ్ళకాఫీ అయినా తాగి ఎన్నాళ్ళయిందో ?

లేచి చల్లనీళ్ళతో ముఖం కడుక్కుని ఉదయం విడిచిన చీరె ఉతికి ఆర కట్టింది.

ఆ సాయంత్రానికి మరదలు వచ్చింది. ఆడబిడ్డ వచ్చిందని తెలుసుకుంది. గబగబా లోపలికివచ్చి ఆప్యాయంగా పలకరించింది. ఆ రాత్రి వంటచేసి హాస్యాలాడుతూ భోజనం పెట్టింది.

పగలు హాయిగా ఆదమరచి నిద్రపోయిన రమణమ్మకు నిద్రపట్టలేదు. చాపమీద విశ్రాంతిగా పడుకున్నది. రెండుపూటల భోజనం కాఫీ. ఇలా చాపమీద దిండు తలకింద పెట్టుకుని పడుకుని ఒక్కరోజయినా గడిపినట్టు తనకు జ్ఞాపకం లేదు. పనులు ఓదానినొకటి తరుముకుంటూ ఎదురొచ్చేవి. ఎంత చాకిరిచేసినా ఐదు నిమిషాలపాటు విశ్రాంతిలేదు. వంటపని, ఇంటిపని, పిల్లలపని, అబ్బుబ్బ ఎన్ని పనులు చేసినా కడుపునిండా తిండి ఎరగదు. లేవలేకపోయినా చాకిరి తప్పేది కాదు. సుస్తిచేసి పడుకుంటే పలకరించి నోట్లో ఇన్నినీళ్ళు పోసేవాళ్ళుకాదు. ఎట్లా ఉందని అడిగేవారు లేరు. అటువంటి జీవితం ఎన్నాళ్ళుగడిపింది? ఎవరికి చేసింది ఇంత చాకిరి ? తననెవరు చెయ్యమన్నారు ? ఒకదాని తరువాత ఒకటి, దానివెంట మరొకటి వరసగా వచ్చిన వాటిని తన బాధ్యత అనుకొని నెత్తిమీద వేసుకుని చేసింది.

అందరూ తనవాళ్ళే.

లేచి చెంబు ఎత్తి మంచినీళ్ళు తాగింది.

తన భర్తపోయేసరికి తనకు నిండా ఇరవై ఏళ్ళులేవు. తనకు ఇద్దరుపిల్లలు, పిల్లలతో కూడా తనను తీసుకువెళ్ళి పోషించింది తన మరిది. తన తోడికోడలు ఏటా బాలెంత, ఏటా చూలింత, ఇంటినిండా పిల్లలు. మంచి మనసుతో తనను పిల్లలతో పోషిస్తున్నా వారింటి కష్టసుఖాలు తనవేననుకుంది. అది మొదలు పిల్లల పని, ఇంటిపని, వంటపనీ నాగాలేకుండా చేసింది.

తన పిల్లలు తను చేసిన చాకిరి ఫలితంగా పెరిగారు పిల్లకు పెళ్ళిఅయింది. కొడుక్కు చదువు అబ్బింది. చిన్న ఉద్యోగం దొరికింది. ఒక ఇంటివాడయ్యాడు.

రమణమ్మ ఇంక ఊపిరి పీల్చుకుందామనుకుంది. ఒక్కగానొక్క కొడుకును చూసుకుంటూ కాలం గడుపుదామనుకుంది. కాని పెద్ద అవాంతరం వచ్చి పడింది. తన పిల్లలను పైకితీసుకువచ్చిన మరిదికి పెద్దకష్టము వచ్చింది. ఆయన భార్య ఇంతమంది పిల్లలనూవదిలి చనిపోయింది. ఆమె బాధ్యత ఇనుమడించింది. తను ఏం తిన్నదో ఏమి కట్టుకున్నదో, ఎక్కడపడుకున్నదో ఆమెకే తెలియదు.

కూతురికి పురుళ్ళుపొయ్యటానికి వెళ్ళేది, కోడలిని మరిది ఇంటికి తీసుకు వచ్చి పురుళ్ళుపోసింది.

ఇటు కొట్టితే ఇటూ అటుకొట్టితే అటూ దొర్లేబంతిలా ఎవరికవసరమయినప్పుడు వాళ్ళు కార్డురాసి పిలిపించుకునేవాళ్ళు. ఆ తిరుగులాట కూడా తనకానందంగానే ఉండేది. ఎవరికి ఇబ్బందివచ్చినా సహాయపడటం తన ధర్మమనుకుంది.

అలాగయినా తన జీవితం సాఫీగా నడిచిందా ?

తన ఒక్కగానొక్క కొడుకు ముప్ఫైరెండేళ్ళకే నాలుగురోజుల జ్వరంతో కన్నుమూశాడు. కడుపు దుఃఖాన్ని అణచుకొని, తనకు పట్టినగతే పట్టిన కోడల్నీ పిల్లలనూ తీసుకుని మరిది దగ్గరికి వచ్చింది. కూతురి దగ్గర కొన్నాళ్ళూ మరిది దగ్గర కొన్నాళ్ళూ పిల్లలతో కూడా తలదాచుకుంది.

ఇక్కడికి తల్లిలేని పిల్లలనూ, తండ్రిలేని పిల్లలనూ కూడా పెంచింది. అందరినీ పెద్దవాళ్ళనుచేసి పెళ్ళిళ్ళు చేసింది.

విధి ఆమెకింకొక పరీక్షపెట్టింది. మరిది కూతురు పిల్లవాడినికని చనిపోయింది. ఆ తల్లిదండ్రులులేని పిల్లవాడు ఆమెపాలపడ్డాడు. తనకు సుఖమెట్లా ఉంటుందో తెలియదు. ఆ బాధ్యతను కూడా తలదాల్చింది.

తను పెంచిన పిల్లలమీద ప్రాణం లాగుతూఉంటుంది. అప్పుడప్పుడు పని కట్టుకునివెళ్ళి చూసి వచ్చేది.

తన కూతురు అన్నపూర్ణ పన్నెండుమంది పిల్లల తల్లి. ఆమె తన పిల్లల పురుళ్ళకు తనను పిలిపించేది వాళ్ళతో అత్తవారిళ్ళకు పంపించేది.

పైకి తిరుగుతున్నట్టు కనబడేది కాని ఏకైక పుత్రశోకం ఒంటరిగా వున్నప్పుడు తన్నుకుంటూ పైకిలేచేది. పట్టలేని దుఃఖము పొంగిపొరలేది. హుఁ........ ఎవరింట్లో ఏడిస్తే ఏంతప్పో !

రాత్రిళ్ళు గంటలకొద్దీ ఏడ్చేది. "నాయనా, నీకెందుకురా నామీద ఇంత నిర్దయ? నాన్న మాదిరిగా నీవుకూడా నా కన్యాయంచేయాలా? నేనేం పాపం చేశానురా?" కుళ్ళికుళ్ళి ఏడ్చేది.

రమణమ్మ లేచి మరిన్ని మంచినీళ్ళుతాగి గాలివీచేవైపుకు చాపలాక్కుంది. ఇన్నిరకాల జ్ఞాపకాలు కళ్ళకుకట్టినట్టుగా కనబడుతుంటే ఇంక నిద్రేంపడుతుంది? ఆ చీకట్లో కళ్ళుతెరుచుకుని పడుకుంది.

ఏవో మాటలు ఎక్కడినుంచో వినబడుతున్నాయి ఇంత రాత్రివేళ ఎవరు మాట్లాడుతున్నారు ?

"ఇదేమిట్రా ఇంతకాలానికి దిగబడ్డది ఈవిడగారు ఏ ఉద్దేశ్యంతో వచ్చిందంటావు ?"

"ఏమో మరి"

"ఆవిడది ఒక అరఎకరం పసుపుతోట ఉండేది. పసుపంటే బంగారమనుకో. ఆ అరఎకరం మీనాన్న ఏదో మాయచేసి అమ్మి నాలుగెకరాల పొలంకొన్నారు. దాంట్లో ఇప్పుడు ఎకరం పసుపు వేస్తున్నాం మనం. ఆ ఆదాయమే ఎక్కువ అన్నిటికంటె. ఆమెకు ఇంకో అరఎకరం వరిపొలం ఉంది. అది మంచిరేగడి భూమి. పంట బాగావస్తుంది. మనం తినేధాన్యం అదే."

"ఆ భూములు అత్తయ్యవని ఎప్పుడూ నాన్నకూడా అనలేదే ? నీవయినా చెప్పలేదేమమ్మా !''

"ఆ మాట ఎప్పుడో మరిచిపోయాం. ఇప్పుడదంతా మనపేరుమీద ఉన్నది. ఆవిడ మళ్ళీ ఊళ్ళో అడుగుపెడుతుందని ఎవరనుకున్నారు ?"

"పెద్ద హోదాలోఉన్న అల్లుడూ మరిదీ వాళ్ళపిల్లలూ, ఆమె అక్కడ అష్టైశ్వర్యాలూ అనుభవిస్తుంటే ఈ భూమి కావలసివచ్చిందా? ఇంతకూ ఎందుకొచ్చిందో మనకింకా తెలియదుగా ?"

"ఒకవేళ అడిగితే?"

"ఆ సంగతులన్నీ నీకేం తెలుసు? నాకేం తెలుసు? ఉన్నదో లేదో స్వర్గంలో ఉన్న నాన్నకు తెలుసు."

"ఒకవేళ అత్తయ్య అడిగితే చెప్పేజవాబిదేనా ?"

''అంతేగా ?"

రమణమ్మ తన చెవులారా విన్న మాటలకు ఆశ్చర్యపడ్డది. కొంత సేపటికి ఇది సహజమేననిపించిందామెకు.

తను పెంచిన తమ్ముడే స్వంత అక్క విషయంలో ఇలా ప్రవర్తిస్తే, పాపం వీళ్ళ తప్పేముంది? చేతిలో ఉన్నదాన్ని పోగొట్టుకోవటమంటే ఎవరికయినా బాధేగా?

పొద్దున్నే లేచి మామూలుగా ముఖంకడుక్కుని "ఏం మరదలా, నిన్న గుళ్ళోపూజలు బాగా జరిగాయా ?" అడిగింది.

"దివ్యంగా జరిగాయి, ఎంత జనమో చెప్పలేము."

"మన ఊళ్లో దేవాలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయా ?''

"జరుగుతున్నాయి గాని ఆ ఊళ్ళో జరిగినట్టు జరగవు''

"నేను పుట్టిన ఊరిది. నాకు తెలిసినవాళ్లెవరైనా ఉన్నారేమో అలా వెళ్ళి చూసివస్తాను" రమణమ్మ చిన్న గ్లాసుతో కాఫీతాగి బయలుదేరింది. కాఫీ నిన్నటిలాలేదు. ఇదీ సహజమే ననుకుంది మనసులో.

ఆ ఊరు కొత్తగాకనబడ్డా రమణమ్మకు తెలిసిన పాత ఇళ్లూ అప్పటి మనుష్యులూ కొందరింకా ఉన్నారు.

పెరట్లో పెద్ద బాదంచెట్టున్న సుబ్బయ్యగారిల్లు గుర్తుపట్టింది. మెల్లగా లోపలికి వెళ్ళింది. సుబ్బయ్య వాకిటి వసారాలో పడుకుని ఉన్నాడు.

"బాబాయ్, బాగున్నావా ! ఇంకా లేవలేదా ?" మంచందగ్గర నిలబడ్డది.

"ఎవరమ్మా ? కళ్ళుసరిగా కనపడవు. పొరలు వచ్చాయి."

"నేను బాబాయ్ రమణమ్మను, జ్ఞాపకం వచ్చిందా ? సాలూరు నరసయ్య అక్కను. మా నాన్న చంద్రయ్య."

''సాలూరు చంద్రయ్య ! ఏనాటివాడు ? ఇప్పుడు జ్ఞాపకంవస్తోంది. నీవు రమణమ్మవా ? అత్తారింటికెళ్ళిన తరువాత మళ్ళీ చూడలేదు. నీ పిల్లలూ మనమలూ బాగున్నారా అమ్మా !"

"బాగానే ఉన్నారు.''

"చిన్నతనంలోనే నీకు దశమారింది. కష్టపడి పిల్లలను పెంచి పెద్దవాళ్ళను చేశావు. ఇప్పుడెక్కడుంటున్నావు ? అమ్మాయి దగ్గరా ? మనమడిదగ్గరా ?"

"ఒక చోటనేదేముంది ? అందరిదగ్గరా ఉంటూనే ఉంటాను.''

"చాలాఏళ్ళకు నీవు పుట్టినఊరు చూడాలనిపించిందా ? అలా కూర్చో'' కోడలు అన్నపూర్ణను పిలిచాడు.

"అత్తయ్యను పిలుచుకురా."

ధనియాల కాఫీతో అచ్చమ్మ వచ్చి "ఎవరూ ?" అంది.

"మన చంద్రయ్య కూతురు రమణమ్మే. ఎంతకాలానికి వచ్చిందో ఈ ఊరు ? ఇవాళ ఉండమను, వెళ్ళనీయకు" సుబ్బయ్య ధనియాలకాఫీ గ్లాసందుకున్నాడు. ఆయనకు పాతసంగతులన్నీ కళ్ళముందర బొమ్మకట్టాయి ఐదారేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు పగటిభోజనం తమ ఇంట్లోనే చేసేది. మీగడ అడిగివేయించుకునేది. జీడిపప్పులు దోసిట్లో పోయించుకుని పారిపోయేది. తల్లి పోయినతరువాత ముద్దుమురిపెమంతా పోయింది. ఆ చంద్రయ్యకు మతిపోయినట్లయి ఒక మూల కూర్చునేవాడు. తనే కలిగించుకుని సంబంధాలుచూసి ఒకటి సెటిల్ చేశాడు. కృష్ణమూర్తి అందగాడు, చురుకైనవాడు, చదువుకుంటున్నాడు. ఉద్యోగం చేసుకుని బతుకుతారనుకుని చంద్రయ్యను ఒప్పించి, అరఎకరం పసుపుతోట, అరఎకరం వరిపొలం ఇచ్చి పెళ్ళిచేయించాడు.

చంద్రయ్య ఆకస్మిక మరణానికి ఉత్తరం రాసినా రమణమ్మ రాలేదు. ఏమో ? అత్తవారిల్లు, వీలుకాలేదనుకున్నాడు. ఆ తరువాత ఇద్దరు పిల్లలుపుట్టా

రని విన్నాడు. పిడుగులాంటి మాట ఆ కొద్దికాలానికే తన పాపపు చెవులతో విన వలసి వచ్చింది, అల్లుడు కృష్ణమూర్తి చనిపోయాడు.

తనకు ఆడపిల్లలేదు. రమణమ్మే తన కూతురనుకున్నాడు. చిన్నతనం లోనే బిడ్డకు ఎంతకష్టం వచ్చింది ? వంశం పెద్దది. మర్యాదగల కుటుంబం, ఆయన తమ్ముడు ఆదుకున్నాడని తెలిసింది. కూతురిది పెద్దకాపురం, ఆమె అందరినీ చూసుకుంటుంది. లోకంలో పుట్టినవాళ్ళందరూ సుఖపడతారా ? కష్ట సుఖాలు కావడికుండలన్నారు. ఒకసారి ఇటు ఒకసారి అటూ కావడి జరుగుతుంది. మళ్ళీ సర్దుకుంటూ ఉండాలి.

రమణమ్మను మధ్య కూర్చోబెట్టుకుని భోజనంచేశారు. ఆ ఆప్యాయతకు రమణమ్మ గుండె పొంగిపోయింది. కబుర్లు చెప్పతూనే పగలు నిద్రతీసింది. రెండు గ్లాసుల మంచినీళ్ళుతాగి "బాబాయ్ నేను వెళ్ళిరానా ? అప్పుడప్పుడు వచ్చి చూస్తూ ఉంటాలే" అంటూ బయలుదేరింది.

ఆమె అలా ముందుకు నడకసాగించింది. గుంపులు గుంపులుగా తంగేడు చెట్లు ఉండేవక్కడ, కొందరు గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. పొలంపనులు చేసుకుని బతుకుతున్నారు. అవన్నీ చుట్టివస్తుంటే పాలేరు వెంకన్న కనిపించాడు. తను చూసినప్పుడు పన్నెండేళ్ళవాడు. తను గుర్తుపట్టలేదు గాని వాడే పలక రించాడు. "నరసయ్యగారి అక్కాకదండీ ?'' అంటూ.

కొండంత సంతోషం కలిగింది.

"యిల్లెక్కడ వెంకన్నా?"

"ఆ పక్కాకుందండి, చూడండి" వచ్చి తీసుకువెళ్ళాడు. పెరడు పెద్దది, ఒక మూలగా గుడిసెవేసుకున్నాడు. మిగతాస్థలంలో ఏవో చెట్లపాదులు పెట్టింది భార్య.

"వెంకన్నా, నీకు పిల్లలా ?"

"ఇద్దరుపిల్లలండి, కొద్దిగా చదువుకున్నారండి, పెద్దవాడికి బంట్రోతు పనండి, చిన్నవాడు ఇంకోఊళ్లో సైకిల్‌దుకాణం పెట్టాడండి. పెళ్ళిళ్ళయినాయి. వాళ్ళూ వాళ్ళకుటుంబాలు బాగానేఉన్నారండి."

"మరి నీవు?"

"నేను పాతపనేనండి. పొలం కౌలుకుతీసుకున్నానండి."

"అయితే వెంకన్నా నీ పెరట్లో నేనొక చుట్టిల్లుకట్టుకోనా?"

''ఎందుకండి?''

''ఎందుకేమిటి? ఉండటానికి''

''ఇక్కడా? మా పెరట్లోనా?'' ఆశ్చర్యపోయాడు.

"అవును ఇంతకాలం మేడల్లో మిద్దెల్లోఉన్నాను. చుట్టింట్లోఉండాలని ఎంతకాలంనుంచోకోరిక. అందుకే ఈ ఊరువచ్చాను. ఎట్లాగయినా ఒక మనిషికి సరిపడా చిన్నదికట్టు. నేనూ సహాయంచేస్తూఉంటాను. నీ ఋణం ఉంచుకోను."

"అమ్మగారూ, అమ్మగారూ ఎంతమాట? మీరు ఉంటానంటే కడతాలెండి." అంతకంటె ఆ స్థితిలో అతడెక్కువ మాట్లాడలేకపోయాడు.

"ఎక్కడికెళ్ళావమ్మా భోజనమైనాచెయ్యలేదు మధ్యాహ్నం?" సాయంత్రం ఆరుగంటలవేళ ఇంటికివచ్చిన ఆడపడుచును అడిగిందిమరదలు వాకిట్లోనే.

''సుబ్బయ్య బాబాయిగారింటికి చూద్దామనివెళ్ళితే వాళ్ళు భోజనం చెయ్యమన్నారు. అక్కడినుంచి ఊరంతా ఒకసారి చుట్టబెట్టివచ్చాను. పుట్టిన ఊరుకదా?"

"కాళ్ళు కడుక్కురా, మేనల్లుడొచ్చాడు. అత్తయ్యేదని అడుగుతున్నాడు."

రమణమ్మ నవ్వుతూ లోపలికినడిచింది. తన మధ్యాహ్నభోజనం తీసిపెట్టి వట్టున్నారు. అదే రాత్రికితిన్నది.

''ఏమిటమ్మా ఈ ఊరివిశేషాలు?'' మరదలడిగింది. "ఉన్నవాళ్ళకంటె కొత్తగావచ్చిన నాకేంతెలుస్తాయి?"

''ఆ సుబ్బయ్య బాబాయిగారేమంటున్నారు?''

"కళ్ళకు పొరలొచ్చాయట. సరిగా కనబడటంలేదట. చిన్నప్పుడువాళ్ళింట్లో ఉన్నానుకనుక ఆకబుర్లే చెప్పుకున్నాం"

ఆ రాత్రంతా తల్లీ కొడుకులు అనుమానపడుతునే ఉన్నారు - రమణమ్మ సుబ్బయ్యగారింటికి వెళ్ళిందంటే.

ఉదయంలేవగానే స్నానంచేసి విడిచినబట్ట ఆరవేసుకుని "మరదలా, అట్లావెళ్ళొస్తా" నంటూ బయలుదేరింది. ఆమె వెళ్ళేసరికి కట్టెలుపాతి పెండె కడుతున్నారు వెంకన్నా అతనిభార్య.

''ఎప్పుడు మొదలుపెట్టారు? అప్పుడే ఇంతకట్టారు?'' ఆశ్చర్యపోయింది రమణమ్మ.

"అందులోపుట్టి అందులో పెరిగినవాళ్ళం. రేపీపాటికి మట్టిముద్దలువెయ్యమా? మాపటివేళకు కప్పుపడదా? ఆకుకొట్టుకొచ్చాను" అన్నాడు వెంకన్న. అతడి పాక ఒక మూలకూ, రమణమ్మ చుట్టిల్లు ఇంకోమూలకు.

ఒకచోటతవ్విన మట్టిమీదనీళ్ళుపోసి బాగా కాళ్ళతోతొక్కి తయారుచేశారు. ఆ మట్టే గోడలకుపూస్తాడుకాబోలు అనుకున్నది రమణమ్మ.

"ఈ పనిలో మునిగిపోయావు పొలానికివెళ్ళవా ఏమిటి వెంకన్నా?"

"పొలమంతా దున్నిపెట్టాను. ఒక్కవానకొడితే మళ్ళీదున్నాలి. అంతేనండి ఇంకా వారంరోజులు పనిలేదండి."

చూస్తూఉండగానే గుమ్మానికి కిటికీకి స్థలంవదిలిపెట్టి చుట్టిల్లు పెండెకట్లతో తయారయింది.

''పొద్దెక్కింది. అయమ్మకు గ్లాసెడుపాలుఇయ్యి'' అన్నాడు వెంకన్న భార్యతో.

తెల్లగాతోమిన గ్లాసుతో పాలుచేతికిచ్చింది.

"వెంకన్నా, నీకు గొడ్లున్నాయా?" అడిగింది రమణమ్మ.

"ఒకగేదె ఒకఆవు ఉన్నాయండి. ఒక ఎడ్లజత దున్నటానికుందండి. వాటిని మేతకు తోలానండి"

రమణమ్మ పాలుతాగుతూ ఆలోచిస్తోంది. ఒక నిమ్మచెట్టు? ఒక కొబ్బరిచెట్టు? చుట్టింటికి దగ్గరగావేస్తే ఎట్లాఉంటుందని.

తనకు రేపటినుంచీ ఆధారమేమిటి?

వెంకన్నకు తను ఏంసహాయం చేయగలదు?

వెంకన్న వెదురుబద్దలు నిలువుగ అడ్డంగాపాతి కిటికీతయారుచేశాడు. లావుపాటి వెదురుబొంగులతో గడప తయారుచేశాడు.

రమణమ్మ కాళ్ళుకడుక్కుని లోపలికిరాగానే ''ఏమిటమ్మా ఏకాదశని గుడికి వెళ్ళావేమిటి?" అన్నది మరదలు పనసఆకులు దొప్పగాకుట్టి ఏకాదశి పిండితోనింపి చేతికిచ్చింది.

"మీరంతా నాకోసం కూర్చుంటారేమోనని భయపడ్డాను లేదుకద?" దొప్పను పెరట్లో దూరంగా చెత్తలోపడేసి, చెయ్యికడుక్కునివచ్చింది రమణమ్మ.

"మజ్జిగతాగు" అంటూ చేతికిచ్చింది.

మంచినీళ్ళకూ మజ్జిగకూ రంగులోనేభేదం. రమణమ్మ ఇటువంటివేమీ పట్టించుకోదు. మరదలు గదిలోకివెళ్ళగాచూసి కొంగుపరచుకొని వసారాలో పడుకుంది ఆలోచిస్తూ.

ఐదుగంటలు దాటినతరువాత మేనల్లుడొచ్చాడు.

"అత్తయ్యా పొద్దున నేను లేచేసరికే నీవెక్కడికోవెళ్ళావు" అన్నాడు పలకరింపుగా.

"తెలిసినవాళ్ళు చాలామందిలేరు కాని-ఊళ్లో నలుగుర్నీ కలుసుకుని పలకరించాను."

తల్లీకొడుకులు ఉలిక్కిపడ్డారు.

మరునాడు ఉదయం రమణమ్మ వెళ్ళేసరికి వెంకన్నభార్య మట్టిముద్దలు అందిస్తోంది వెంకన్నచేతులతో మట్టినిమెత్తుతున్నాడు.

రమణమ్మ ఇటూఅటూచూసింది. రెండురోజులపేడ కుప్పగా పడిఉంది. బావిలోనుంచి కడవతోనీళ్ళుతెచ్చి దానిమీదచల్లి పిసికి పిడకలుచేసి ఊకలోఅద్ది గోడకుకొట్టింది. ఆ చుట్టుపక్కలంతాఊడ్చి చెత్తకుప్పలోకితోసింది. వెంకడు పాలుతీసి ఉట్టిమీద పెట్టాడుగాని భార్య కాచినట్టులేదు.

రమణమ్మ పాలకుండకడిగింది. దాలిలో బూడిదతీసి పిడకలుపేర్చింది. నిప్పురాజేసి కుండలోపాలుపోసి దానిమీద పెట్టింది.

"మీరేమిటమ్మగారూ? నేను చేతులుకడుక్కుని పెడతాగద?" వెంకన్న భార్య పరుగెత్తుకుంటూవచ్చింది. గోడకున్న పిడకలుచూసి "మీరు పిడకలు చేయొచ్చునా అమ్మగారూ? వెంకన్నచూస్తే నన్ను తిట్టేస్తడు" బుగ్గమీద చెయ్యేసుకుంది.

వెంకన్న భార్య పద్దాలు పొయ్యిరాజేసుకుని కుండపొయ్యిమీది కెక్కించటానికి వెళ్ళింది. ఇంతలో రమణమ్మ మట్టిముద్దలందించటం మొదలుపెట్టింది. పన్నెండుగంటలకల్లా మట్టితో మెత్తటమయింది. అది ఆరిపోతే మెత్తటిమట్టితో పూతపుయ్యాలి.

మధ్యాహ్నం పన్నెండుగంటలయింది.

"అమ్మగారు, ఇప్పుడెక్కడికి పోతారు? అటుకులున్నాయి. పాలల్లో వేసుకుని తినండి. ఆ చెట్టుకింద చాపేసుకోండి"

రమణమ్మ ఆలోచించింది. ఈవేళప్పుడు మేనల్లుడింటికి పోయినా ఏముంది? ఏదో ఇంతపడేసి గదిలోకెళ్ళి పడుకుంటుంది మరదలు.

రమణమ్మకు తాటాకుల కప్పుతో చుట్టిల్లు తయారయింది. పద్దాలు అలికి ముగ్గులుపెట్టింది. వెంకన్న ఈతాకుల చాప ఒకటి ఇచ్చాడు. రమణమ్మ ఒక పక్కగా పొయ్యొకటి వేసుకుంది. ఆ రాత్రి గ్లాసునిండా పెరుగుపోసి పద్దాలుఇస్తే రమణమ్మ మనసు అదోలా అయింది.

ఆ రాత్రి ఈతాకులచాప మీద చుట్టింట్లో బట్టతలకింద పెట్టుకుని పడుకుంది. మిణుకు మిణుకుమంటూ ప్రమాదంలో ఇటూఅటూ ఊగే దీపంలా ఉంది రమణమ్మ మనసు.

ఒకనిద్రపోయి లేచినతరువాత రమణమ్మకు హాయిగా ఉన్నట్లనిపిస్తోంది. ఉన్నన్నాళ్ళు సుఖంగా ఉండచ్చు. ఇప్పుడు తనకు బంధనాలేమీ లేవు. ఇంతకాలానికి ఈ ప్రాణికి తిరుగులాటనుండి విముక్తి కలిగింది. ఇది నిజమేనా? లేక తన భ్రమా? మళ్ళీ మనసు అల్లిబిల్లిగా తిరగటం మొదలుపెట్టింది.

తన తమ్ముడు చనిపోయినా తనకు తెలియనివ్వలేదు తనవాళ్ళు. ఎందుకని ? ఐదేళ్ళ క్రిందట తన మనమడి భార్య జబ్బుచేసి అసుపత్రిలో చేరింది. ఒకనాడా-ఒక వారమా ? ఆరు నెలలుంది. తను అక్కడుండవలసి వచ్చింది. సరిగ్గా అప్పుడు వచ్చిఉంటాయి తన తమ్ముడు జబ్బుపడ్డాడనీ, చనిపోయాడనీ రాసిన ఉత్తరాలు. ఆ సంగతి తనకు నాడు చెప్పనేలేదు భార్యకూ బిడ్డలకూ అర్థమైన చాకిరీ చేసింది.

పని-తీరికలేని పనిచేసింది. వాళ్ళ పడకగది పక్కన ఉన్న వరండాలో. పగలు ఎండ, రాత్రి చలి, వానకు తడిసేచోటు ఇచ్చారు. ఒకసారి వానకు తడిసినందువల్ల ఒళ్ళు పేలిపోయే జ్వరంవచ్చింది. ఎవరూవచ్చి చూడలేదు. కూతురు సంసారంలో మునిగి తనతల్లి మనమడిదగ్గర బాగానే ఉందనుకున్నది. మూడు రోజులు దిక్కులేనిదానిలా పడుంది. పనిమనిషికి జాలివేసి తనయింట్లో జావకాచి తెచ్చిపోసింది. జ్వరం తగ్గకపోతే ఆసుపత్రిలో చేర్పించింది. జ్వరం తగ్గింది కాని దగ్గు తగ్గలేదు. పదిరోజుల తరువాత ఇంటికి వచ్చింది. మళ్ళీ అదే వరండాలో పడక, పనిమనిషి "పెద్దమ్మగారికి దగ్గుగా ఉందండీ" అని మనుమడికి చెప్పితే "పిల్లలున్నారు" ఇంట్లో. ఆమెకు తలుపు తెరవకు అన్నాడు. పనిమనిషి ఉండలేక "అమ్మగారూ మీరెళ్ళిపొండి ఇక్కడినుంచి" అన్నది.

"నేను ఎక్కడికిపోను? చేతిలో డబ్బులేదు" కన్నీళ్ళు కార్చింది రమణమ్మ.

"నా దగ్గరుండాయి అమ్మగారూ" పదిరూపాయలిచ్చింది.

ఇప్పుడు తనకు బంధుజాలము లెక్కకు చాలామంది ఉన్నారు. కాని ఆత్మీయులు ఎవరూలేరు. ఉండటానికి చోటులేదు. కట్టడానికి ఒంటినిండా బట్టలేదు. తన కూతురికి ఆమె సంసారమే తలమునకలుగా ఉంది.

తను శరణార్థి.

ఇప్పుడు నిస్వార్థంగా తనకాశ్రయమిచ్చినవాడు వెంకన్న.

ఇతడికి తనేం చెయ్యగలదు ? కాని చేయాలి. ఏదయినా చెయ్యాలి.

రమణమ్మకు జీవితంలో చాకిరి చేసిచేసి ప్రాణము అలసిపోయింది. ఆదరణ లేనిచోట ఎముకలరిగే చాకిరిచేసింది.

అబ్బ ఈ చుట్టిల్లూ, ఈ వెంకన్న పద్దాలూ ఈ ఆదరణ తను స్వర్గంలో ఉన్నట్టుంది.

ఇది నిజమా ? కలకాదు కదా ?

వెంకన్న పెరట్లో ఉన్న కోడికూసింది.

తెల్లవారింది. పద్దాలు లేచిందోలేదో ?

లేచి ముఖం కడుక్కుని దొడ్డంతా ఊడ్చింది. నీళ్ళుచల్లి ముగ్గేసింది. గొడ్ల దగ్గర పేడంతా తీసి కుప్పవేసింది. ఆ ప్రదేశమంతా శుభ్రంగా ఊడ్చి చెత్త కుప్ప వేసింది. ఇంకా పద్దాలు లేవలేదనుకుంటూ ఆ పేడంతా పిసికి పిడకలుచేసి గోడకు కొట్టింది.

వెంకన్న లేచాడు "అదేమిటమ్మగారూ ? మీరు పిడకలు చెయ్యటమా ? చేతులు కడుక్కోండి. అయ్యయ్యో పెరడంతా ఊడ్చేశారు. నీళ్ళుచల్లారు. లేవండి లేవండి"

"ఏం తప్పు వెంకన్నా, నీవింత ఆదరించి తలదాచుకోవటానికి గూడు కల్పించావు. ఈ కాస్తపని చేస్తే తప్పా ? నాకు పాలుతీయటం వచ్చు చెంబు బయట పెట్టు"

"అదికూడా మీకెందుకమ్మగారూ ?"

వెంకన్న ముఖం కాళ్లూ చేతులూ కడుక్కున్నాడు. పాలచెంబు తెల్లగా తోముకుని పాలుతీశాడు. అంతలో పద్దాలు లేచింది. పెరడంతా చూసి "అయ్యో అమ్మగారూ ! మీరేపనంతా చేస్తే ఏంబాగుంటుంది. నాకు కళ్ళుపోవు మీచేత ఇంత పని చేయించుకుంటే ?" గబగబా వచ్చి రమణమ్మ కాళ్ళమీదపడ్డది.

"లేమ్మా, కళ్ళుపోవటమేమిటి ? నేను మీలో వచ్చి పడ్డప్పుడు నేను మీలో ఒకదాన్ని కానా ? ఈ కాస్తపని చేయకుండా కొత్తమనిషిలా అన్నీ నీ చేత చేయించుకోనా ? ఇప్పటికే నేను వచ్చినందువల్ల మీకెంతో కష్టము కలిగింది. అయినా మనలో మనకేం తప్పమ్మా !" మందలించే ధోరణిలో అన్నది రమణమ్మ.

పద్దాలు వెంకన్నా ఇద్దరుకూడా ఆమెను నెత్తిన పెట్టుకుని పూజిస్తున్నారు.

వర్షాలు పడటం ప్రారంభమయింది. పద్దాలు, వెంకన్న పొలంపనులు చేసుకుంటున్నారు? నారుపోశారు. నాట్లువేశారు.

రమణమ్మ పెరట్లో కూరగాయలు పెంచటానికి నారు తెప్పించుకుంది. చెట్లపాదులుపెట్టి పందిళ్ళువేసింది. తన చుట్టింటికీ వెంకన్నపాకకూ మధ్యగా రెండు నిమ్మచెట్లూ రెండు కొబ్బరిమొక్కలూ వేసింది. నూకలు చౌకగా దొరుకుతాయని వెంకన్నచేత తెప్పించుకుంటోంది. వెంకన్న ఎంత బలవంతం చేసినా అతడిదగ్గర ఉన్న వడ్లు తీసుకుని మరపట్టించుకోవటం లేదు.

వెంకన్న తెచ్చియిచ్చిన నూకలకుతగ్గ పనిచేస్తున్నది.

వెంకన్న పాకలకు సమీపంలో చాలా గుడిసెలుఉన్నాయి. కూలిచేసుకుని బతికేవాళ్ళు. వాళ్ళఇళ్ళకు సాయంకాలం వేళల్లో వెళ్ళేది. వాళ్ళు ఏంతింటారో చూస్తూ ఉండేది. వాళ్ళందరినీ పరిచయం చేసుకుని మాట్లాడుతూ ఉండేది. వాళ్ళ పిల్లలకు జ్వరంవచ్చినా జలుబుచేసినా వాంతులూ బేదులూ అయినా తనకు తెలిసిన వైద్యం చేసేది. పెద్దమ్మగారంటూ వీళ్ళంతా ఆమెను ఆప్యాయంగా పలకరించి ఇంటిముందర కూర్చోబెట్టుకునేవారు.

వెంకన్న పొలంనుంచి వస్తూ మిరపపళ్లూ గోంగూర దోసకాయలూ తెస్తూ ఉండేవాడు. రమణమ్మ అతడేవి తెచ్చినా వాటితో పచ్చళ్ళు చేసియిచ్చేది. పెసర కంది అల్చందలు తెచ్చినప్పుడు గుగ్గిళ్ళు వేసిపెట్టేది.

పద్దాలు సహాయంతో వాళ్ళకు ఊరగాయలుపెట్టి కుండలలో నింపి ఇచ్చేది.

వర్షాకాలమయినా చలికాలమయినా రమణమ్మ తన వెంట తెచ్చుకున్న మారుబట్టతోనే కాలక్షేపం చేస్తున్నది. ఆ చుట్టింటికి తడకను తలుపుగా అడ్డం పెట్టేవాడు వెంకన్న.

ఆ వేసవికాలం మామూలుగాలేదు. ఎండలు ఎన్నడూ లేనంతగా మాడ్చేస్తున్నాయి. పసిబిడ్డలూ వృద్ధులూ అలమటించి పోతున్నారు. పెరట్లో కూరగాయలు కాయటం తగ్గింది. కొద్దికొద్దిగా పెట్టిన ఆకుకూర మడులు చుట్టూ తాపిన ఆకు మండల చాటున ఏపుగా పెరగలేక, పోసిన నీళ్ళకు ఇగుర్చుకు బతుకుతున్నాయి. వాటినే వంటకు తనకూ వెంకన్నకూ కలిపి ఉపయోగిస్తున్నది రమణమ్మ. చింతాకు పొడి కొట్టిపెట్టుకుని వాళ్ళకింత ఇస్తున్నది;

"చూడు పద్దాలూ, అమ్మగారు వచ్చింతరువాత మనకు రుచులు బాగా తెలుస్తున్నాయి కదూ?'' అన్నాడు వెంకన్న.

"అంతకు ముందు నేను కారప్పొడేసి పెట్టినప్పుడు ఈమాదో అన్నావు."

"ఆ రుచీ ఈ రుచీ ఒకటేనా?"

"ఆ యమ్మకు వంటలు బాగవచ్చు"

"ఆ మాటే నేనన్నది. అమ్మగారొచ్చినాక మనయింటికి దేవుడొచ్చినట్లనిపిస్తున్నది. పెద్దదిక్కుగా ఉంది. మాయమ్మ ఉన్నట్టే ఉందనుకో. మనం ఆ యమ్మకేం తక్కువ చేయొద్దు."

"పిడకలు చేయటం గొడ్ల దగ్గర బాగుచెయ్యటం నేను లేవకముందే అమ్మగారు చేస్తున్నారు."

"ఎట్లా చూసుకుంటావో అమ్మగార్ని."

రమణమ్మ అప్పుడే గుడిసెలన్నీ చుట్టివచ్చింది. ఒక గుడిసెలో జ్వరం, ఒక దానిలో వాంతులు, ఒక దానిలో దగ్గు- పిల్లలతో బాధపడుతున్నారు కూలీ జనం. రమణమ్మ వాళ్ళందరికీ తన చేతనైన వైద్యంచేసి పెద్దవాళ్ళకు ధైర్యం చెప్పింది. మరునాటికి తగ్గిపోతుందనీ, తగ్గకపోతే మళ్ళీ మందుచేసి ఇస్తాననీచెప్పి వచ్చింది.

అడుగు పెడుతుండగా వాళ్ళమాటలు ఆమె చెవిన పడ్డాయి. పాటకజనంలోనే అప్యాయత కృతజ్ఞత వెర్రి అభిమానం ఇంకా మిగిలిఉన్నాయి. వీటితోపాటు పట్టుదలలూ కక్షలూ తెగింపూ కూడా ఉన్నాయి. ఏదయినా అధిక ప్రాళ్ళలోనే కనబడతాయి. అసంస్కృతమూ అనాగరికమూ అయినా స్వచ్ఛమూ కల్తీలేనిదీ.

నాగరికతలో అంతా కృత్రిమము. ఏ భావమూ స్వచ్ఛంగా కనబడదు. అన్నిటికీ ముసుగులు-తొడుగులు-పెదవులమీద తేనెలూ"

రమణమ్మ అన్నీ చూసింది. ఏదీ ఆమెకు విపరీతంగా కనబడటంలేదు. ఈ ప్రపంచంలో అన్నీ సహజమేననిపిస్తున్నాయి. 'లోకంతీరు!' అనుకుంటుంది. దూషణ భూషణలు ఆమెనేమీ చలింపచేయలేని స్థితి.

"ఇంత పొద్దుపోయినా ఇంకా పడుకోలేదుటర్రా?" చుట్టింటి తడకవిప్పింది.

"అమ్మగారూ ఇంతరాత్రివేళ గుడిసెలవెంట తిరుగుతున్నారు. మందులిచ్చి వస్తున్నారా?" వెంకన్న పాకలోనుంచి బైటికివచ్చాడు.

"ఏదో నాకు తెలిసిన వైద్యం, శొంఠి, మిరియాలు, జీలకర్ర, కరక్కాయ వీటితోనే వైద్యం. కొందరికి కషాయం, కొందరికి మాత్రలు. పడుకోండి పడుకోండి."

రమణమ్మ కాళ్ళు కడుక్కొని పద్దాలు ఇచ్చినపాలుతాగి ఈతాకుల చాప పరచుకుంది.

కునుకు పట్టిందోలేదో రమణమ్మకు పెద్దగా అరుపులూ జనం పరుగెత్తుతున్నట్టూ వినబడ్డది. ఆమెలేచి బైటికి వచ్చేసరికి జనమంతా గుడిసెలవైపు పరుగులు తీస్తున్నారు. పద్దాలూ వెంకన్నా జనంలో కలిసిపోయారు.

మంటలూ పొగ గుడిసెలవైపు కనిపిస్తున్నాయి. "అయ్యయ్యో, గుడిసెలంటుకున్నాయి, ఇంకేముంది? అందరు ముందు బైటకొచ్చేయండి" కేకలు పెడుతూ రమణమ్మ గుడిసెల దగ్గరికి వెళ్ళింది.

అప్పటికే చాలామందికడవలతో నీళ్ళుపోసి మంటలార్పటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు లోపలికి వెళ్ళి చేతనైన సామాన్లుతెచ్చి బైటపడేస్తున్నారు.

కాని ఆర్పినకొద్దీ మంటలు పైకెగుస్తున్నాయి. ఆరినట్లే ఆరి మళ్ళీ రాజుకున్నాయి.

"అయ్యో, బాలింత నిన్ననే పురుడొచ్చింది. పసిబిడ్డతో అందులోనే ఉందా?" రమణమ్మ ఒకగుడిసెలోకి దూరింది. ఆ చిన్న గుడిసెవైపు ఎవరూచూడలేదు. మంటలు ఆ గుడిసెనూ అందుకున్నాయి. వెదురు బొంగులు ఫట్ ఫట్ మంటూ పేలుతున్నాయి. గుడిసెముందు భాగం కూలిపోయింది. పోసిన నీళ్ళకు మంటలు ఆరలేదు విజృంభించాయి. అందరూచూస్తూ నిలబడటం తప్పఏమీ చేయలేక పోయారు. బాలెంత పసిబిడ్డలతో పాటు రమణమ్మకూడా సజీవదహనమైపోయారు.

వెంకన్న చెప్పిన వెంటనే సుబ్బయ్యవచ్చి కాలిపోయిన రమణమ్మదేహాన్ని చూసి 'తల్లీ నీపీ ఊళ్ళోనే ఉన్నావా? పుట్టిన గడ్డకోసం ఇంతదూరంవచ్చి ఇక్కడే సజీవ దహనమైపోయావా? తల్లీ ఇందుకేనా ఈ ఊరువచ్చింది?' ముఖాన బట్టపెట్టుకుని ఏడ్చాడు.

గుడిసెలలో ఉన్న కూలిజనంలో కొందరు ఆమెను లోపలికిపోగా చూశారట. కాని-మంటలు బూడిదతోపాటు పైకి లేచాయి- ఎవరూ లోపలికి వెళ్ళలేకపోయినారు. లోపలవాళ్ళు బైటికి రాలేకపోయినారు.

గుడిసెలలో ఉన్నవాళ్ళు "అప్పుడు కనబడ్డ-పెద్దమ్మగారెటు వెళ్ళారు?" ఆసందడిలో అప్పుడు జ్ఞాపకం వచ్చింది రమణమ్మ వాళ్ళకు.

ఉడుకు చల్లారిన తరువాత లోపలికిపోయి చూసిన వెంకన్నకు పసిబిడ్డను గుండెకు హత్తుకున్న రమణమ్మ బాలెంత మాడిపోయి ఉన్నారు.

కట్టెలెవరు కొనాలి? చితికి నిప్పెవరు పెడతారన్న ప్రశ్న ఉదయించ కుండా ప్రకృతే శరణార్థికి సహకరించి ఆదరించింది.